సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు చుట్టు పక్కల ప్రాంతంలో దాదాపు 25 ఏళ్ల క్రితం 30కి పైగా లేఅవుట్లు వేశారు. వీటిలో వేలాది మంది ప్లాట్లను కొన్నారు. అయితే, గత పదేళ్లుగా అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని కాలువలు, తూముల ద్వారా కిందికి వదలకపోవడంతో చెరువులో నీటి మట్టం పెరిగింది. ఫలితంగా వేలాది ప్లాట్లు చెరువులో మునిగిపోయాయి. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు ఇప్పుడు చేతికి రాకుండా పోవటంతో వాటిని కొన్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా తమ సమస్యపై ప్రభుత్వానికి విన్నవించే ప్రయత్నాలు చేసినా ఫలితం లభించలేదని చెబుతున్నారు. సదరు చెరువును జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తించినందున నీటిని కిందికి వదిలేది లేదని అధికారులు అంటున్నారని పేర్కొంటున్నారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 97 ఎకరాలే అయినప్పటికీ.. నీటి మట్టం పెరిగిపోవటంతో మినీ రిజర్వాయర్‌గా తయారైంది. నిరంతరం మియాపూర్, బాచుపల్లి తదితర ఎగువన ఉన్న కాలనీల నుంచి పెద్ద ఎత్తున మురుగునీరు వచ్చిచేరడంతో నిండువేసవిలో సైతం చెరువు నిండుకుండను తలపిస్తోంది. పెద్ద చెరువు కింద మొత్తం 14 గొలుసుకట్టు చెరువులు, కుంటలు ఉన్నాయి. పెద్ద చెరువు నీటిని ఏటా దిగువకు వదలకపోవడంతో ఈ చెరువులు, కుంటలు క్రమంగా కబ్జాలకు గురై కనుమరుగవుతున్నాయి. అయినప్పటికీ, నీటి విడుదల జరగటం లేదు. పెద్ద చెరువులో చేపలు పెంచేవారు సైతం దిగువకు నీరు వదలకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కాగా, పెద్ద చెరువు నీటి ముంపు కారణంగా ఇళ్ల స్థలాలతోపాటు వ్యవసాయ భూములు కూడా ఏళ్ల తరబడి నీట మునిగిపోతున్నాయి. దీంతో ఆయా భూముల రైతులు సాగును పక్కనపెట్టారు. విచిత్రమేమిటంటే గతంలో హుడా, హెచ్‌ఎండీఏ, పంచాయతీ అనుమతులతో వేసిన లేఅవుట్లు సైతం నీట మునిగాయి. సర్వేనెంబర్లు 196, 197, 198, 146, 149, 176, 177, 323, 324, 209, 211, 174, 199, 200, 202, 203, 205 లలోని దర్శన్‌నగర్, పాంచజన్య, వెదిరి, పద్మావతినగర్, వాణినగర్, ఆర్‌కే 1, ఆర్‌కే 2, ఆర్‌కే 3 తదితర 30 కాలనీలలోని ప్లాట్లు పెద్ద చెరువునీటిలో మునిగిపోయాయి. సుమారు ఐదువేల మంది ప్లాట్లు కోల్పోయారు. పదుల సంఖ్యలో రైతుల భూములు జలమయం అయ్యాయి. పాంచజన్య కాలనీలో ఓ ఇన్‌కంటాక్స్ అధికారి పదేళ్ల క్రితం రెండస్తుల భవనం నిర్మించిన తరువాత చెరువు నీరు పెరగడంతో దానిని అసంపూర్తిగా వదిలేశారు. పదేళ్లుగా చెరువు నీటిలోనే ఉన్న ఆ అసంపూర్తి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.


పాంచజన్య లేఅవుట్ జలమయం అవడంతో అసంపూర్తిగా వదిలేసిన రెండంతస్తుల భవనం

అమీన్‌పూర్ పెద్ద చెరువును జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించినా గతం నుంచీ ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదు. చెరువులోకి నిరంతరం డ్రైనేజీ, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఈ మురు

అభివృద్ధి శూన్యం

గునీరు వల్ల.. జీవవైవిధ్యం మాట అటుంచి.. చెరువు పరిసరాలు కంపుకొడుతూ సమీపప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువునీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హెచ్‌ఎండీఏ అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇకనైనా చెరువు నీటిని దిగువకు వదిలి వాస్తవ చెరువు విస్తీర్ణాన్ని పరిరక్షిస్తూ, కలుషితం కాకుండా చూడాలని చెరువు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు డిమాండ్ చేస్తున్నారు.


అవార్డుతో కళాశాల ఛైర్మన్, సెక్రటరీలు

సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అవార్డు

మేడ్చల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ నుంచి సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు గౌరవనీయమైన ఎకోసిస్టమ్ ఎనేబుల్డ్ ఇన్‌స్టిట్యూషన్ అవార్డు దక్కింది. ఈ మేరకు బుధవారం కళాశాల వైస్ ఛైర్మన్ సీహెచ్ భూపాల్‌రెడ్డి, సెక్రటరీ సీహెచ్ శ్రీశైలంరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కళాశాలకు అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కళాశాలలోని సౌకర్యాలను వినియోగించుకుని భావి భారత పౌరులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. ఈ అవార్డు తమ క్యాంపస్‌లోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో మా నిబద్ధతను గుర్తించాయన్నారు. డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, డీన్ ఈడీసీ ఎకోసిస్టమ్ ఎనేబుల్డ్ ఇండివిజువల్ అవార్డును పొందారు. ప్రిన్స్‌పాల్ ఎ.శ్రీనివాసులరెడ్డి ముఖ్య సూచనలు చేస్తూ హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి డా.కె.విరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు ఇతర అధ్యాపకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

యాచారంలో ఆగని దేవరకొండ డిపో బస్సులు

యాచారం, మార్చి 13 : మండల కేంద్రం గుండా హైదరాబాద్, దేవరకొండ వెళుతున్న దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులను యాచారంలో ఆపడం లేదు. యాచారం మండల కేంద్రంలో బస్టాండ్ ఉన్నా ఇక్కడ బస్సు ఆపేది లేదని డ్రైవర్, కండక్టర్లు విద్యార్థులు, ప్రయాణీకులను బస్సు నుంచి దింపేస్తున్నారని, దాంతో తమకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని పలువురు ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. బాలికలు, మహిళలను బస్సు నుంచి దింపి అవమాన పరుస్తున్నారని పలువురు ప్రయాణీకులు చెప్పారు. ఇబ్రహీంపట్నం, దేవరకొండ డిపోల ఆర్టీసీ అధికారులు విచారణ చేసి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

కందుకూరు , మార్చి 13 : తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆమె విగ్రహానికి మండల శాలివాహన అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, ప్రధానకార్యదర్శి ఆలూరి జంగయ్య, కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు సురేశ్, ఈశ్వర్, శివ, కోశాధికారి లింగం, నరేష్, ఉన్నారు.

యాచారం : కుమ్మరులు సమాజ సేవకు అంకితం కావాలని మండల కుమ్మర సంఘం నాయకుడు నడికూడి కృష్ణ అన్నారు. బుధవారం యాచారం మండలంలోని గున్‌గల్‌లో మొల్ల విగ్రహాన్ని ఆ సంఘ నాయకులు ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల సొసైటీ ఛైర్మన్ టి. రాజేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కె.యాదయ్య, భీమ్‌యాదవ్, మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణయాదవ్, ఉన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

వికారాబాద్, మార్చి 13: మసీదుల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమైన సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణ, వీధిదీపాలు, మంచినీటి సదుపాయం కల్పించాలని వికారాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజులకు ముస్లిం మైనారిటీ నాయకులు మెమోరాండం అందించారు. అందుకు వెంటనే స్పందించిన ఛైర్‌పర్సన్ మంజులరమేష్.. మున్సిపల్ అధికారులతో మాట్లాడి మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణతో పాటు ఎక్కడైతే వీధిదీపాలు లేవో అక్కడ వెంటనే ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయం కల్పించాలని బుధవారం అధికారులను ఆదేశించారు. అడిగిన వెంటనే స్పందించడంతో ఛైర్‌పర్సన్‌కి మైనారిటీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఛైర్‌పర్సన్‌ని కలిసిన వారిలో కోఆప్షన్ సభ్యులు, ఎర్రవల్లి జాఫర్, వికారాబాద్ నియోజకవర్గం మైనారిటీ ఛైర్మన్ సర్ఫరాజ్, వికారాబాద్ పట్టణ మైనారిటీ ప్రెసిడెంట్ హాజీ పాషా, వికారాబాద్ పట్టణ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఫరూక్, వికారాబాద్ టౌన్ జనరల్ సెక్రెటరీ ముస్తాక్, కొత్తగాడి ఉస్మాన్, జహంగీర్, మహమ్మద్, లాల్ మహమ్మద్, జిలాని, ఐలేద్, మౌలానా, కుట్బుద్దిన్ తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్‌లో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

- పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక


సహకార సంఘం ఉపాధ్యక్షుడు బద్దం అనంతరెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, మార్చి 13 : ఘట్‌కేసర్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి భారీషాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ బద్దం అనంతరెడ్డి ఆయన కుమారుడు, నర్సింహరెడ్డితో పాటు దాదాపు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం రాత్రి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్న ప్రత్యేక సమావేశంలో అనంతరెడ్డితోపాటు మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలకు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ మాల్లారెడ్డి లాంటి భూ కబ్జాదారులను పార్టీలోకి చేర్చుకోవడాన్ని పార్టీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుందన్నారు. అయినా అనేక మంది కాంగ్రెస్‌లో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. పార్టీలో చేరాలనుకుంటున్న వారిని స్థానిక కమిటీల నిర్వాహకులు వెళ్లి కలిసి ఆహ్వానించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం సాధించేందుకు కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఛైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, కొంతం అంజిరెడ్డి, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చిన్న నర్సింహగౌడ్, శ్రీశైలం, గణేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- ఐదు రోజుల పాటు నిర్వహణ
- 18న స్వామివారి కల్యాణం, 19న రథోత్సవం



ఆమనగల్లు, మార్చి 13 : జిల్లాలో ప్రసిద్ధ ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆమనగల్లు పట్టణంలోని అలివేలుమంగ సమేత శ్రీ వేంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ప్రతి ఏటా పాల్గుణ శుద్ధసప్తమి మొదలు పాల్గున శుద్ధ ఏకాదశి వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఇక్కడ కన్నుల పండువగా నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచే కాక మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, జిల్లాల నుంచి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈనెల 16 నుంచి మార్చి 20 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం వద్ద నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ప్రధాన అర్చకుడు గూడ క్రిష్ణమాచార్య చెప్పారు. 16న విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, అంకురార్పణం, దేవతాహ్వానం, భేరి పూజ, 17న సుప్రభాతసేవ, నిత్యారాధన, మహాభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, ఎదుర్కోళ్లు, 18న అలివేలు మంగ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 19న రథోత్సవం, అదేరోజు రాత్రి దీపోత్సవం, 20న చక్రతీర్థం, పూర్ణాహుతి, నాగవళి, దేవతాఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కృష్ణమాచార్య కోరారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీచర్లు

జిల్లాస్థాయి భగవద్గీత శ్లోకాల పోటీల్లో సంకల్ప్ విద్యాపీఠం విద్యార్థుల సత్తా

వికారాబాద్, మార్చి 13 : ఇటీవల ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీలో వికారాబాద్ పట్టణంలోని సంకల్ప్ విద్యాపీఠం విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ఛైర్మన్ ధనశెట్టి మళిగి, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌లు తెలిపారు. ఈ పోటీల్లో 7వ తరగతికి చెందిన తిరుమల్ తనుశ్రీకి మొదటి బహుమతిగా సైకిల్‌ను, 9వ తరగతికి చెందిన భువన కృతి, 10 వ తరగతికి చెందిన ప్రణవిరెడ్డి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం వారిని ఛైర్మన్ ధనశెట్టి మళిగి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఆరుట్లలో శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

మంచాల, మార్చి 13 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ సీనియర్ నాయకుడు బుగ్గరాములు, మాదగోని జంగయ్యగౌడ్‌లు అన్నారు. బుధవారం పార్టీ నేతలతో కలిసి ఆరుట్లలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మానిఫెస్టోలో పేర్కొన్న ఆరుగ్యారెంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పేదలకు ఇంటినిర్మాణం కోసం ఐదులక్షల నిధులను మంజూరు చేస్తుందని హామీఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రావులబాష, దాసరమోని రమేష్, బుగ్గరాములు, బుట్టికృష్ణ, అశోక్, శ్రవణ్, భాస్కర్, ప్రభాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్‌పై ఆశలు!

- మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవుల కోసం తీవ్ర పోటీ
- ఆశావహుల ప్రయత్నాలు.. అధిష్ఠానం చుట్టూ ప్రదక్షిణలు



పరిగి, మార్చి 12: నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులు కావస్తోంది. కొత్త గా మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమిస్తామని ఇటీవల మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించిన సంగతి విదితమే. ఇటీవల రాష్ట్రంలోని కొన్ని మార్కెట్ కమిటీ లకు ఇప్పటికే పాలకవర్గాలను నియమించింది. పరిగి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియాకమంపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలలోపు కొన్ని పాలకవర్గాలను నియమిస్తారన్న ప్రచారంతో అశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. లోక్‌సభ, సర్పంచులు, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకోడ్‌తో ఆరు మాసాలపాటు ఆగాల్సి ఉంటుంది. అందువల్ల ఎన్నికలకోడ్ రాకముందే పాలకవర్గాల నియయాకాలు చేపట్టాలని పార్టీ శ్రేణులు, అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నాయకులు నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీల్లో పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం కూడా అనుచర గణాన్ని పిలిపించుకుని అభ్యర్థుల ఎంపికపై సమాలోచనలు జరుపుతున్నారు. పరిగి మార్కెట్ కమిటి పదవికి తీవ్ర పోటీ ఉంది. ఛైర్మన్ పదవికి జనరల్ కేటగిరి నుంచి రంగంపల్లి కృష్ణారెడ్డి, బి.పరుశరాంరెడ్డి, అభిరామ్, కద్మూరిశ్రీనివాస్, పాలాది శ్రీనివాస్, బీసీ కేటగిరి నుంచి పి.చిన్న నర్సింహులు, ఆనంద్‌గౌడ్, అశ్రఫ్, ఆనెం అంజనేయులు, యు.శివకుమార్, ఎస్సీ కెటగిరి నుంచి ఇ.కృష్ణ, ఎస్.రామకృష్ణ, మహిపాల్, తదితరులు పోటీ పడుతున్నారు. కులకచర్ల కమిటీ ఛైర్మన్ పదవిని శ్రీధర్‌రెడ్డి, బీఎస్ అంజనేయులు, భరత్‌కుమార్, బాలముకుందం, అంజిలయ్యగౌడ్‌లు ఆశిస్తున్నారు. ఛైర్మన్ పదవి తమకే అంటే, తమకే వస్తుందని ధీమాతో ఉంటున్నారు. అయితే పాలకవర్గాలు నియామకాలు ఎప్పుడు జరుగుతాయనే దానికోసం ఇక వేచిచూడాల్సిందే మరి!

నేటి నుంచి లోక్ అదాలత్

షాద్‌నగర్, మార్చి 13 : మహాశివరాత్రి సందర్భంగా వాయిదా పడ్డ లోక్‌అదాలత్‌ను నేటి నుంచి (గురువారం) తిరిగి ప్రారంభిస్తున్నట్లు మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్వర సమస్యల పరిష్కారం కోసం మూడు రోజుల పాటు నిర్వహించే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. లోక్‌అదాలత్ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా రిటైర్డ్ జడ్జి రవీంద్రసింగ్, మెంబర్‌గా న్యాయవాది సీహెచ్ శ్రీనివాసమూర్తి కొనసాగుతారని చెప్పారు.

జీపీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలని వినతి

షాద్‌నగర్, మార్చి 13 : గ్రామపంచాయతీ కార్మికుల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్‌రాజు మాట్లాడుతూ ఏడు నెలలుగా కార్మికుల వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలను పెంచాలని ఆయన కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తలకొండపల్లి, మార్చి 13 : అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుధాకర్, బీఎస్పీ జిల్లా నాయకుడు కానుగుల జంగయ్య, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగ ఫలాలు పేదల దరిచేరినప్పుడే అంబేడ్కర్‌కు అసలైన నివాళి అని వారు పేర్కొన్నారు. మండలంలోని చంద్రధన గ్రామంలో ఈనెల 24న తలపెట్టిన అంబేడ్కర్ విగ్రహఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం కోసం బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. విగ్రహావిష్కరణకు సంబందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, హాజరవుతున్నట్లు తెలిపారు. సుధాకర్, శేఖర్‌యాదవ్, పోతుగంటి కృష్ణ, కుమార్, కిరణ్, రాజు, మధు, ప్రవీణ్‌కుమార్, కుమార్, అనిల్, గణేశ్, యాదగిరిరెడ్డి, యాదగిరి, పాల్గొన్నారు.

ఆరెకటికలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కేశంపేట మార్చి 13 : రాష్ట్రంలో వివిధ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని అందులో ఆరెకటికలను విస్మరించారని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ముల్తాంకార్ శివాజీ బుధవారం ఓ ప్రకటన లో విమర్శించారు. ఎన్నికల సమయంలో తమకు ఎస్సీ హోదా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మా మాట తప్పారని విమర్శించారు. ఆరెకటికలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

29న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

తలకొండపల్లి , మార్చి 13 : తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 29, 30న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కే.మల్లేశ్, ఆర్. తిరుపతి తెలిపారు. గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోటీలు ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. మెన్స్ ఉమెన్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు, విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ. 20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, ఉమెన్స్ ఓపెన్ కేటగిరిలో మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి జట్ల పేర్లు నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు చెప్పారు.


అంగన్‌వాడీ కేంద్రాలకు తక్షణమే నీటి వసతి కల్పించాలి

యాచారం. మార్చి 13 : అంగన్‌వాడీ కేంద్రాలకు తక్షణమే తాగు నీటి వసతి కల్పించాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చౌదర్‌పల్లి పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం చౌదర్‌పల్లిలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి వసతి ఎందుకు లేదని, పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతి రోజు సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేయాలన్నారు. రోడ్లపై చెత్తచెదారం పడితే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వారం విధిగా ఓహెచ్ఎస్ఆర్ వాటర్ టాంకును శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి నీరు కలుషితం కాకుండ చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీకార్యదర్శి జ్యోత్స్నరెడ్డి తదితరులున్నారు

యాచారంలో 18 గంటలే త్రీఫేజ్ విద్యుత్

యాచారం, మార్చి 13 : యాచారం మండలంలో 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ కేవలం కాగితాలకే పరిమితమైంది. 24 గంటల విద్యుత్ అటకెక్కింది. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కేవలం సింగిల్ ఫేజ్ విద్యుత్‌ను మాత్రమే అధికారులు సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు 18 గంటల పాటు మాత్రమే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఒక పక్క భూగర్భజలం లేక రైతులు నానా ఇబ్బందుల పాలవుతుండగా, 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సక్రమంగా రాకపోవడంతో తన చామగడ్డ చేను చేతికందే పరిస్థితి లేకుండా పోయిందని చౌదర్‌పల్లికి చెందిన గౌర మల్లేష్ అనే రైతు వాపోయారు. కాగా 18 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ సందీప్‌కుమార్ చెప్పారు.

లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

కందుకూరు , మార్చి 13 : కందుకూర్ లయన్స్‌క్లబ్‌లో ఉత్తమ సేవలు అందించిన క్లబ్ కార్యదర్శి లయన్ వెంకటేశ్వర్లు గుప్తకు ఉత్తమ కార్యదర్శి అవార్డు వరించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని గీతాంజలి రీజియన్ కాన్ఫరెన్స్‌లో ఉత్తమ సేవలందించిన వారిని అభినిందిస్తూ నిర్వహకులు అవార్డులు అందించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లుకు అవార్డు రీజియన్ చైర్మన్ సాదు ప్రభాకర్‌రెడ్డి, మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, జిల్లా వైస్ గవర్నర్ జి మహేంద్రకుమార్‌రెడ్డి, చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

షాద్‌నగర్, మార్చి 13 : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ బుధవారం పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్యులు ఆర్థికంగా ఎదిగినప్పటికీ వారిలో ఉన్న పేదలను దృష్టిలో పెట్టుకునే సీఎం రేవంత్‌రెడ్డి వారికోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. వివిధ కార్పొరేషన్ల ఏర్పాటులో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కేవలం 100 రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆగీరు రవికుమార్‌గుప్తా, ఆర్య వైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి సరాపు రమేష్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు కల్వ యాదగిరీశ్, గుడిపల్లి వెంకటరమణ, కర్నాటక మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ అడుగులు

ఆమనగల్లు : సామాజికన్యాయం, సమానత్వం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలుపడం హర్షదాయకమని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ల ఏర్పాటు ద్వారా వివిధ కులవృత్తుల వారికి సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పదేళ్లలో సాధ్యం కాని పనులను వంద రోజుల్లో చేసిన చూయించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా ప్రభుత్వం సాకారం చేయబోతుందని చెప్పారు. అర్హులైన వారికి త్వరలో తెల్లరేషన్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు జగన్, వస్పుల శ్రీశైలం, కృష్ణనాయక్, మానయ్య, అలీం, ఫరీద్, శ్రీకాంత్, నాజర్, ఉన్నారు.

'వీరశైవ' కార్పొరేషన్ ఏర్పాటు హర్షదాయకం

వీరశైవ లింగాయత్‌ల సంక్షేమాన్ని కాంక్షించి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షదాయకమని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్.టి పంచాక్షరి అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్పొరేషన్ ఏర్పాటుకు వీరశైవలింగాయత్‌లు ప్రభుత్వాలపై పోరాటం కొనసాగిస్తూ వస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయించడం లింగాయత్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నంప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షట్కార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బలిజ కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం వీరశైవ లింగాయత్ లింగబలిజ ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటుపై ఆ సంఘం మంచాల మండల అధ్యక్షుడు కె.శేఖరప్ప హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని వర్గాలకు లబ్ధి


మధుసూదన్‌రెడ్డి

షాబాద్ : కార్పొరేషన్ల ఏర్పాటుతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మధుసూదన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం వంద రోజుల్లోనే కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని వర్గాలు కాంగ్రెస్‌కు కృతజ్ఞత తెలియజేస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఆయన చెప్పారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి


కసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి 13 : ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి ప్రజల ఇబ్బందులు తీరుస్తామని చెప్పారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం ఆయన పర్యటించారు. 11వ వార్డు ఆదర్శనగర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని బ్లాక్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.ఏ ఖలీల్, యూత్ కాంగ్రెస్ నాయకుడు రఫీ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా మండల అధ్యక్షుడు జగన్, వస్పుల మానయ్య, విజయ్, రాజశేఖర్, ఉన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు


పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

కేశంపేట, మార్చి 13: మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులో వెలసిన మహాలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అంతరాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ఔత్సాహికుల ఎద్దుల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలను తిలకంచడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే మహాలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధితునికి ఎల్వోసీ అందజేత

కొండారెడ్డిపల్లె గ్రామానికి చెందిన సూరం జంగయ్య అనారోగ్యంతో బడపడుతుడంతో గమనించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎం సహాయ నిధి నుంచి రూ. 2లక్షల ఎల్వోసీని మంజూరు చేయించి బుధవారం బాధితునికి అందజేశారు. జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ యాదయ్యాయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, పల్లె ఆనంద్‌కుమార్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, శశివర్థన్ రెడ్డి, జగదీశ్వర్ప ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల నర్సింలుగౌడ్, ప్యాక్స్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్ గౌడ్, ఆలయ పూజారి కుమారస్వామి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న కోదండరెడ్డి,తదితరులు

యాచారం, మార్చి 13 : యాచారం మండలంలోని వివిధ గ్రామాల్లోని భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. కోదండరెడ్డి, లీప్స్ సంస్థ చైర్మన్ భూమి సునిల్ అన్నారు. మండలంలోని పది గ్రామాల నుంచి భూ సమస్యలపై లీప్స్ సంస్థకు అందిన 2075 ఫిర్యాదులను వారు బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్‌కు ఇచ్చారు. తమకు రైతులు ఫిర్యాదు చేసిన ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలన చేసి వాటిని పరిష్కరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను రైతుల కందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు పట్టాభూములు భూదాన్‌భూమి, ప్రభుత్వభూమి అని రికార్డు అయ్యాయని చెప్పారు. ఆ భూములపై విచారణ చేసి రైతులను ఆదుకోవాలన్నారు. తప్పుడు రికార్డులను సరి చేసి రైతుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు రెవెన్యూ అధికారులను కోరారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్/మొయినాబాద్, మార్చి 13 : మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మన్‌మర్రిలో వరల్డ్ కినెక్ట్ కార్పొరేషన్, సీపీడబ్ల్యూ ఫౌండేషన్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫికేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం బోడంపహాడ్ గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల తోనే జరిగాయని తెలంగాణలో ప్రతి పల్లె అభివృద్ధికి నిధులు అందించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్, మాజీ సర్పంచ్ సుహాసినిసత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, నాయకులు రాము, మహేందర్, మాణయ్య, పాల్గొన్నారు.

అలాగే మొయినాబాద్ మండల పరిధిలోని చాకలిగూడ గ్రామంలో బీజేపీ జెండాను బుధవారం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

షాద్‌నగర్, మార్చి 13: సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రధానమంత్రి నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

చౌదరిగూడ, మార్చి 13 : జిల్లేడ్ చౌదరిగూడ మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు.

కందుకూరు, మార్చి 13 : ముదిరాజ్ సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ఎడ్ల ఉదయ్‌కిరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎడ్ల ఉదయ్‌కిరణ్, ఉపాధ్యక్షుడు ఎడ్ల లింగయ్య, కార్యదర్శిగా ఎడ్ల శ్రీనివాస్, సభ్యులుగా కిషోర్, రవీందర్, ఎన్నికయ్యారు.

మద్యం మత్తులో గాంధీ విగ్రహం ధ్వంసం



షాద్‌నగర్, మార్చి 13 : మద్యం మత్తులో భారత జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఓ వ్యక్తి ధ్వంసం చేసిన సంఘటన ఫరూక్‌నగర్ మండలం అన్నారం గ్రామ ముఖ్య కూడలిలో బుధవారం రాత్రి జరిగింది. అదే గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ తన గ్రామ పరిధిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని చూసి తీవ్ర ఆగ్రహానికి లోనై విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. ఆ వ్యక్తి అన్నారం గ్రామం కొండయ్య గుట్ట తండాకు చెందిన వాడని తెలిసింది.

ప్రజలకు మెరుగైన సేవలు

యాచారం, మార్చి 13 : ప్రజలకు మెరుగైన సేవలందించాలని, న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో ప్రేమ పూర్వకంగా మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు అన్నారు. బుధవారం యాచారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సివిల్ తగాదాల్లో తలదూర్చరాదని సిబ్బందికి హితబోధ చేశారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చిన ఇరు వర్గాల వాదన విని కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలన చేసి దర్యాప్తు చేయాలన్నారు. ఆయన వెంట సీఐ శంకర్ కుమార్, ఎస్సైలు గోపాల్, సత్యనారాయణ, వెంకటనారాయణ తదితరులున్నారు.

పశువులకు గాలి కుంటు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న భానునాయక్

కడ్తాల్, మార్చి 13 : మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. మండల పశువైద్యాధికారి డాక్టర్ బానునాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి పశువులకు గాలి కుంటు టీకాలు వేశారు. బుధవారం మక్తమాదారం , రేకులకుంట తండా, గోవిందాయిపల్లితండా, అన్మాస్‌పల్లి గ్రామాల్లో 609 పశువులకు టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని భానునాయక్ సూచించారు. పశువైద్య సిబ్బంది రాజేశ్, మల్లేశ్, రమేశ్ నాయక్, అఫ్సర్, బురాన్, పంచాయతీ కార్యదర్శి రాజు, చంద్రశేఖర్, సంజీవ, వాల్యా శ్రీశైలం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గుల గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్, మార్చి 13 : హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామం బూర్గుల గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. బూర్గుల 125వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న బూర్గుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ చూపాలని కోరారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

కేశంపేట, మార్చి 13 : యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎన్నారై గోగు వెంకట నారాయణరెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని భైర్ఖన్‌పల్లి, లేమామిడి గ్రామాల్లో బుధవారం శ్రీ లక్ష్మీనరసింహ బ్రహ్మోత్సవాల పురస్కరించుకొని క్రికెట్ పోటిలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహాభావం పెంపొందుతుందని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్‌కిట్, జెర్సీలను అందించారు. అల్వాల ఎంపీటీసీ సురేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, రూప్లనాయక్, శశివర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


శ్రీధర్(ఫైల్)

యాచారం, మార్చి 13 : కానిస్టేబుల్ ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా యాచారం మండలం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌పరిధి మేడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మేడిపల్లికి చెందిన శ్రీధర్(24) ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షలకు హాజరయ్యాడు. అతడు ఉద్యోగానికి ఎంపిక కాలేదు. దీంతో కొన్ని రోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి తండ్రి గుండాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.నర్సింహారావు తెలిపారు.

అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు

- జేసీబీ, రెండు టిప్పర్లు సీజ్


సీజ్ చేసిన వాహనాలు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 13 : ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల శివారులోని అసైన్డ్ భూమిలో అనుమతి లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీ, రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. రెండు, మూడు రోజుల నుంచి గుట్టు చప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం రావడంతో పోలీసులతో కలిసి దాడి చేసినట్లు ఆయన చెప్పారు. జేసీబీతో మట్టి తవ్వి రెండు టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. ఆ మూడు వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

షాట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

శంషాబాద్ రూరల్, మార్చి 13 : షాట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైన సంఘటన బుధవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా, పాండురంగాపురం, బల్లేపల్లికి చెందిన ఉపేందర్‌రావు అనే పాస్టర్ తన స్నేహితుడితో కలిసి టీఎస్ 05 ఎఫ్‌డీ 3653 నెంబరు గల కారులో ఈ నెల 12న తన ఇంటి నుంచి కర్ణాటకలోని రాయచూర్‌కు బయలుదేరారు. మార్గ మధ్యలో మండల పరిధిలోని మదన్‌పల్లి గేటు వద్దకు రాగానే ఒక్కసారిగా కారు ఇంజన్‌లో మంటలు వ్యాపించాయి. డ్రైవర్ రాజేష్ కారును పక్కకు ఆపేశాడు. కారులో ఉన్న ముగ్గురు బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. షాట్‌సర్క్యూట్ వల్లనే కారులో మంటలు వ్యాపించిన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కారు యాజమాని ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు చెప్పారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

షాబాద్, మార్చి 13 : బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామానికి చెందిన ఉప్పరి రమేష్(27) చందన్‌వెల్లి పారిశ్రామిక వాడ వెల్‌స్పన్ కంపెనీలో గత మూడు నెలల నుంచి ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే కంపెనీకి వచ్చి విధులు ముగించుకొని మంగళవారం సాయంత్రం తన స్వగ్రామానికి వెళుతుండగా చందన్‌వెల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తన బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న సుధాకర్ గమనించి పక్కననే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపోయాడు. మెరుగైన వైద్యం కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య ఉప్పరి జాన్సీరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భర్తతో గొడవ పడి భార్య ఆత్మహత్య

చేవెళ్ల, మార్చి 13 : భర్తతో గొడవపడి ఇంట్లో ఉరివేసుకుని భార్య మృతి చెందిన ఘంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వీరబ్రహ్మం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా తాండూర్ నుంచి బతుకుదెరువు నిమిత్తం భీంకుమార్, అతని భార్య రేణుక చేవెళ్ల మండల కేంద్రంలో ఓ గదిని అద్దెకు తీసుకుని కూలీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. చేవెళ్లలో జరుగుతున్న జాతరకు వెళ్లే విషయంలో ఈ నెల 12న రాత్రి భార్యభర్తలు ఇద్దరు ఇంట్లో గొడవపడ్డారు. దీంతో మనస్థాపం చెందిన రేణుక(27) బుధవారం తెల్లవారు జామున చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకుని పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి మల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్పష్టం చేశారు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

కందుకూరు, మార్చి 13 : డబ్బులను అధికంగా సంపాదించుకోవడానికి లక్ష్యం చేసుకున్న వలస కూలీలు గంజాయి అమ్ముకుంటూ కందుకూరు పోలీసులకు చిక్కారు. బుధవారం సీఐ మక్బుల్ జానీ తెలిపిన వివరాలు ఇలావున్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎండీ మీరాజ్‌అన్సారీ(27), ఎండీ షాబుద్ధీన్(26) కూలీ పని నిమిత్తం సంవత్సరాల క్రితం మండల కేంద్రానికి వచ్చారు. కాగా మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని హైటెక్ దాబా వద్ద వారు గంజాయిని అమ్మడానికి ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద నుంచి 2కేజీల 300 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు సీఐ మక్బుల్‌జానీ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కేశంపేట, మార్చి 13 : బతుకుదెరువు కోసం కేశంపేట మండలానికి వచ్చిన ఓ వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. కేశంపేట ఎస్సై కుప్పగిరి లింగం, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా కల్లూర్ మండలం పెద్దతెగురుకు చెందిన తెలుగు శివశంకర్(55) మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ శివారులోని భూమయ్య అనే వ్యక్తికి చెంది. మామిడి తోటను లీజుకు తీసుకుని అక్కడే ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కాగా ఆయన ఉంటున్న గదిలో నుంచి దుర్వసన రావడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చెరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. రెండు రోజుల కింద అతను మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గదిలో బోజనం చేస్తుండగా గుండెపోటు రావడంతో బోర్లాపడి చనిపోయి ఉండవచ్చని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతిడికి భార్య లక్ష్మీతో పాటు ఇద్దరు కుమార్తెలు ఓ కుమారుడు ఉన్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తమ్ముడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ


విద్యార్థులకు అందిస్తున్న నాయకులు

కేశంపేట మార్చి 13: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల ప్రభుత్వ పాఠశాల చదువుతున్న విద్యార్థులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో బీస కరుణాకర్ రెడ్డి, చంద్రయ్య, గుత్తి శేఖర్, మల్లేష్, నిరంజన్, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.